PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 323 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 16 నవంబర్ 2026

110 మంది చిన్నారులతో బాలల దినోత్సవ వేడుకలు



3లో

సామాజిక న్యాయ సాధనలో న్యాయవాదులదే కీలక పాత్ర



3లో

చివరి వన్డేలో భారత్ ఘన విజయం



2లో

- 22 పరుగులతో న్యూజిలాండ్‌పై గెలుపు.. 3-1తో సిరీస్ కైవసం
- అర్ష్‌దీప్, సిరాజ్ బౌలింగ్ ధాటికి కివీస్ విలవిల

చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం



అమరావతి,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.చంద్రబాబు నివాసానికి వెళ్లిన షర్మిల పెళ్లి వివరాలను ఆయనకు తెలియజేసి, తప్పక హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వానించిన షర్మిల, తాజాగా చంద్రబాబును కలవడం రాజకీయ వర్గాల్లో మిగతా2లో...

నక్సలిజం కోరల్లో గిరిజన

సమాజం

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో
- ఓటు హక్కును కూడా కాలరాశారు
- గత పాలకులు ఆదివాసీల
- బాధలను పట్టించుకోలేదు
- హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో
- మారుతున్న పరిస్థితులు
- బిర్సా ముండా 151వ జయంతి
- సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



2లో

సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలవాలి!

- మూడు కీలక ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు త్వరగా ఇవ్వండి
- తుమ్మిడిహట్టి ఎత్తు 152 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్రను ఒప్పించండి
- సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ ఇప్పించండి
- భూగర్భ జలాల సంరక్షణకు రూ.5 వేల కోట్ల సాయం అందించండి
- ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తులు



న్యూఢిల్లీ, నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ సాగునీటి రంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో నెలకొన్న అడ్డంకులను తొలగించేందుకు ప్రధాని చొరవ తీసుకోవాలని కోరారు. ఆదివారం ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్-7లో ప్రధాని అధికారిక నివాసంలో నరేంద్ర మోదీతో మిగతా2లో...



యువత పారిశ్రామికవేత్తలుగా

ఎదగాలి

- యువత స్వయం ఉపాధిని ఎంచుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలి
- ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రంగారెడ్డి జిల్లా,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. యువతలోని ప్రతిభ, మిగతా2లో...

మురసు తుపాను విలయం..

- ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం!

రైతాంగానికి భారీ దెబ్బ.. తక్షణ సాయం అందించాలని కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి



అమరావతి,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా పంటలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, ఇళ్లు దెబ్బతినడంతో మొత్తం రూ.2,484 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాలను అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం ఆయన వర్చువల్‌గా సమావేశమై పరిస్థితిని వివరించారు. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు.నాలుగు జిల్లాల్లో 60 ప్రాంతాల్లో పరిశీలన కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని సుమారు 60 ప్రాంతాల్లో పర్యటించింది. పంట పొలాలు, రహదారులు, కాలువలు, మిగతా2లో...



సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

- ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు కేంద్రంగా ఎదగాలి.. రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలి: రాజ్‌నాథ్ సింగ్
- ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం : ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

శేరిలింగంపల్లి,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):అధునాతన సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భారత్ మరింత పురోగతి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడమే కాకుండా, సొంతంగా ఆవిష్కరణలు చేపట్టి ప్రపంచానికి అందించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను బలోపేతం చేయాలని సూచించారు.హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌డీఈ-2026, ఏరోనాట్-2026 అంతర్జాతీయ సదస్సులను ఆదివారం మిగతా2లో...

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు



2లో

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు



2లో

నక్సలిజం కోరల్లో గిరిజన సమాజం

న్యూఢిల్లీ,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): నక్సల్స్ హింసాకాండ వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజన సమాజమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో గిరిజనులను కనీసం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. గిరిజన సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహారాష్ట్ర లోని గడ్చిరోలిలో నిర్వహించిన 'జనజాతీయ గౌరవ దివస్' కార్యక్రమంలో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. మావోయిస్టులు చిన్నారులను, గిరిజన యువతులను అపహరించుకు పోయిన సందర్భాల్లోనూ పాలకులు మౌనం వహించారని అన్నారు. గిరిజనులను ఓటు వేయనివ్వ కుండా అడ్డుకున్నా స్పందించలేదని, సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నక్సల్స్ హింసతో గిరిజన కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, వారి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. **హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో మార్పులు** మావోయిస్టు హింసను అదుపులోకి తీసుకురావడంతో గిరిజన ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని ప్రధాని తెలిపారు. గతంలో భయాందోళనల మధ్య జీవించిన గిరిజన కుటుంబాలు ఇప్పుడు ప్రశాంత వాతావరణంలో జీవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. భద్రత పెరగడంతో గిరిజన తల్లులు, సోదరీమణులు ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. హింసాకాండ కారణంగా బాల్యాన్ని కోల్పోయిన చిన్నారులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తూ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ముందుకు సాగుతున్నారని వివరించారు. **పేదరిక నిర్మూలనలో కీలక పురోగతి** దేశంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన చర్యల ఫలితంగా గత 12 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ వెల్లడించారు. స్వాతంత్ర్యం తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఇదొకటని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అండగా నిలవాలి!

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి సమావేశమై మూడు వినతిపత్రాలు అందజేశారు. **రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు.. ఇంకా అనుమతుల కోసం ఎదురుచూపులు** తెలంగాణ సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కీలక ప్రాజెక్టులపై సీఎం ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని వివరించారు. అయినప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయకుండా అవసరమైన అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను వినియోగించుకోవడంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. **తుమ్మిడిహట్టి ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించండి** ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని రేవంత్‌రెడ్డి ప్రధానిని కోరారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో తాను సమావేశమైన విషయాన్ని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుకూల నిర్ణయం వచ్చేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. **సమ్మక్క-సారలమ్మకు ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇప్పించండి** సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే కేంద్ర జలవనరుల సంఘానికి సమర్పించినట్లు సీఎం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్), బ్యాక్‌వాటర్ స్థాయిల ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, గ్రామాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించామని వివరించారు. ఇందుకోసం రూ.9.88 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) త్వరగా వచ్చేలా చూడాలని ప్రధానిని కోరారు. **సాస్కీ కింద మరో రూ.5 వేల కోట్లు ఇవ్వండి** రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం వరకు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక సహాయం అవసరమని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాస్కీ పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను దాదాపు పూర్తయిన ప్రాజెక్టుల పనులకు వినియోగిస్తామని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని, భూగర్భ జలాల నిల్వలు తగ్గకుండా సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. భూగర్భ జలాల సంరక్షణకు రూ.5 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరారు. **పీఎంకేఎస్‌వై కింద నాలుగు ప్రాజెక్టులకు నిధులు** ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద రాష్ట్రంలోని నాలుగు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఇంటిగ్రేటెడ్ సమ్మక్కసాగర్-సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోదికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకా-కొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తే రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని వివరించారు. **ఖేలో ఇండియా పోటీలకు సహకరించినందుకు కృతజ్ఞతలు** తెలంగాణలో 8వ ఎడిషన్ ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2026 డిసెంబరు 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడల ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానిని ఆహ్వానించారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తెలంగాణకు ఉందని వివరించారు.ప్రధానితో సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను ఆయన నివాసంలో కలిశారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నారు. ప్రధాని భేటీ వివరాలను అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.

మురసు తుపాను విలయం.. ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం!

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ వ్యవస్థ, మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నట్లు గుర్తించింది. **రైతాంగానికి కోలుకోలేని దెబ్బ** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు వరి పంట దెబ్బతిన్నట్లు కేంద్ర బృందం తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ అంచనాల ప్రకారం 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ రంగానికి రూ.875 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.337 కోట్ల నష్టం వాటిల్లింది. **రహదారులు, విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం** రాష్ట్రవ్యాప్తంగా 1,385 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం సంభవించింది. 10,192 హెచ్‌టీ విద్యుత్ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం 3,859 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సహాయక చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసింది. **తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి** వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం సహా పలు రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చంద్రబాబు కేంద్ర బృందానికి వివరించారు. తీర ప్రాంతాల్లో భవిష్యత్తులో తుపాన్లను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నష్టాలపై సమగ్ర నివేదికను త్వరగా కేంద్రానికి సమర్పించి, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తగిన పరిహారం, బాధిత కుటుంబాలకు అదనపు సహాయం అందించే అంశాలను కూడా పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది.

సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను ప్రపంచస్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.పరిశ్రమల భద్రత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) నిపుణుల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్, ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అధ్యక్షుడు డాక్టర్ జైటీర్త్ ఆర్.జోషి పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో దేశ విదేశాలకు చెందిన 2 వేల మందికి పైగా నిపుణులు, 100కు పైగా సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

చివరి వన్డేలో భారత్ ఘన విజయం

మౌంట్ మాంగనుయ్,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):
న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను టీమ్ ఇండియా 3-1తో కైవసం చేసుకుంది. ఆఖరి వన్డేలో భారత జట్టు 22 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో భారత బౌలర్లు సమిష్టిగా రాణించి న్యూజిలాండ్‌ను 48.1 ఓవర్లలో 187 పరుగులకే కట్టడి చేశారు.భారత ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్ చెరో 46 పరుగులతో కీలక పాత్ర పోషించారు. ఆరంభంలో రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) త్వరగా వెనుదిరగడంతో భారత్ కష్టాల్లో పడింది. ఈ దశలో అక్షర్, ఇషాన్ విలువైన భాగస్వామ్యాలతో జట్టును ఆదుకున్నారు. చివర్లో మహ్మద్ సిరాజ్ (14 నాటౌట్), అర్ష్‌దీప్ సింగ్ (14) మెరుపు బ్యాటింగ్‌తో జట్టు స్కోరును 209కి చేర్చారు. **బౌలర్ల సమష్టి ప్రదర్శన**210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు నిలకడగా దెబ్బతీశారు. డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (31), నిక్ కెల్లీ (24), మిచెల్ శాంట్నర్ (24) పోరాడినా ఫలితం లేకపోయింది. అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు సాధించారు. మిగతా బౌలర్లు కూడా సహకరించడంతో కివీస్ 187 పరుగులకే పరిమితమైంది.ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గుర్నూర్ బరార్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. దీంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3-1తో సొంతం చేసుకుంది.

చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యత సంతరించుకుంది.షర్మిల కుమార్తె వివాహం నవంబర్ 25న జరగనుండగా, డిసెంబర్ 5న విందు కార్యక్రమం నిర్వహించనున్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్రమను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు విశాల్, సాగర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువకులు ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా, సొంతంగా పరిశ్రమను స్థాపించి పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. **మరికొందరికి ఉపాధి కల్పించడమే లక్ష్యం కావాలి** యువత కేవలం తమ కుటుంబాల అభివృద్ధికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా ఆలోచించాలని భట్టి విక్రమార్క సూచించారు. స్వయంగా ఉపాధి పొందడంతోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. నూతన ఆలోచనలు, సృజనాత్మకత, పట్టుదలతో ముందుకు సాగితే యువత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలదని తెలిపారు. **పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం** రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు ప్రారంభించాలనుకునే యువతకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విశాల్, సాగర్ తమ పరిశ్రమను మరింత విస్తరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్తులో మరెందరో యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.యువత సాధించే విజయాలు వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ పురోగతికి కూడా దోహదపడాలని, పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ఉపాధి అవకాశాల కల్పనలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు

పుణె,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):
అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. భారత్ అభివృద్ధి, ప్రజాస్వామ్య వ్యవస్థపై విదేశీ ప్రతినిధుల సమక్షంలో విమర్శలు చేయడం సరికాదని అన్నారు. అధికారంలోకి రావాలంటే విదేశీ పర్యటనలు మాని, దేశంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని రాహుల్‌గాంధీకి సూచించారు.ఆదివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. భారత్ పేరుతో నిర్వహించిన సదస్సులోనే దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడటం దురదృష్టకరమని ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని పేర్కొన్నారు.వరుస ఎన్నికల పరాజయాల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం నిరాశతో దేశంపై విమర్శలు చేస్తోందని అమిత్‌షా ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో భారీ అవినీతి జరిగిందని విమర్శిస్తూ, ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 12 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ నేతలు ఇదే వైఖరిని కొనసాగిస్తే మరో 30 ఏళ్లపాటు అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

- కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జాతీయ నాయకుల మెప్పు కోసం రాష్ట్ర గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రి, పీసీసీ అధ్యక్షుడు పరుగెత్తిన తీరును ప్రస్తావిస్తూ.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఈ వ్యవహారం ఉందని విమర్శించారు.మరోవైపు కేంద్ర మంత్రి అమిత్‌షాకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఇస్తున్న ప్రాధాన్యంపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. అమిత్‌షా కాళ్లకు నమస్కరిస్తూ, ఆయన చెప్పులు మోసే స్థాయికి దిగజారడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం, స్వాభిమానం కోసం జరిగిన పోరాట ఫలితంగా ఏర్పడిందని, ఆ విలువలను కాంగ్రెస్, బీజేపీ నేతలు విస్మరిస్తున్నారని కేటీఆర్ తన 'ఎక్స్' పోస్టులో విమర్శించారు.

110 మంది చిన్నారులతో బాలల దినోత్సవ వేడుకలు

కిట్స్ వరంగల్ హ్యూమానిటీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

వరంగల్,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): బాలల ముఖాల్లో చిరునవ్వులు నింపుతూ, మానవత్వం, సేవాభావాన్ని చాటిచెప్పేలా కిట్స్ వరంగల్ హ్యూమానిటీ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని మాలికాంబ మాలవికాస కేంద్రంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సుమారు 110 మంది చిన్నారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయించి, వారికి ఆహారం, పుస్తకాలు, శానిటరీ న్యాప్కిన్లు, డైపర్లు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. చిన్నారులతో ఆనందంగా గడుపుతూ వారిలో సంతోషాన్ని నింపారు.ఈ కార్యక్రమానికి మోతె వెంకటేష్, సునీత దాతలుగా ముందుకొచ్చి తమ వంతు సహకారం





అందించారు. హ్యూమానిటీ క్లబ్ అధ్యక్షురాలు ఎ. రీతిక చౌదరి, ఉపాధ్యక్షుడు కె. యశ్వంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి. సాయి కిరణ్ నాయకత్వంలో క్లబ్ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కళాశాలకు చెందిన ఇతర క్లబ్‌ల సభ్యులు కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కె. శ్రీధర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ డి. ప్రభాకరాచారి, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి డాక్టర్ జి. శ్రీనివాసరావు ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించారు.చిన్నారుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపడంతో పాటు సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. చిన్నారుల చిరునవ్వుల మధ్య వేడుకలు ఆనందంగా ముగిశాయి.

సామాజిక న్యాయ సాధనలో న్యాయవాదులదే కీలక పాత్ర





వృద్ధుల హక్కుల పరిరక్షణకు న్యాయవాదులు అండగా నిలవాలి: జస్టిస్ ఈద తిరుమలదేవి

హనుమకొండ,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): సమాజంలోని అన్ని రకాల అసమానతలను తొలగించి సామాజిక న్యాయం సాధించడంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కమిషన్ ముఖ్య కమిషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి అన్నారు. హనుమకొండలోని హంటర్ రోడ్ డీ కన్వెన్షన్‌లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) ఆరో రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని ఇంటి నుంచి గెంటివేయడం వంటి ఘటనలు ఆందోళనకరమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన గౌరవప్రదమైన జీవన హక్కును వృద్ధులకు అందేలా న్యాయవాదులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ



స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు న్యాయవాదులు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. బహుజన వర్గాల హక్కులు, వాటా సాధనకు న్యాయవాదులు కృషి చేయాలని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో అణగారిన వర్గాలకు కల్పించిన హక్కులను సాధించడంతో పాటు ఐక్యతతో రాజకీయ అధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఐఎల్‌పీఏ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.జె. శాంసన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్యంతో నల్లకోట్లతో నీలి విప్లవం నినాదంతో సంఘం పనిచేస్తోందన్నారు. పూలే, అంబేద్కర్ ఆశయాలతో బహుజన న్యాయ వాదుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామగ్రామానికి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా జడ్జిలు ఎం.ఆర్. సునీత, మైత్రేయి, ప్రొఫెసర్ ఇ. సుధారాణి, గుగులోతు వీరన్న నాయక్, పొన్నం దేవరాజు గౌడ్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. మహిళా స్వేచ్ఛ, ఓట్ల తొలగింపు, సామాజిక న్యాయం, బహుజన ఐక్యత, న్యాయమూర్తుల నియామకాల్లో లోపాలపై చర్చించారు.ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అబ్దుల్ నభి, జన్ను ఆనంద్ కుమార్, లడే రమేష్, వాసం ఆనంద్ కుమార్‌లకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, మేధావులు, ఐఎల్‌పీఏ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య విలీన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



- విద్యా కేంద్రీకరణ వద్దు.. వికేంద్రీకరణే తెలంగాణ ప్రత్యేకత: డాటా

హైదరాబాద్, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్): ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డాటా) డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం2020ను తెలంగాణ రాష్ట్రం అనుసరించరాదని స్పష్టం చేసింది. ఇంటర్, పాఠశాల విద్యా వ్యవస్థల స్వతంత్రతను, ప్రత్యేకతలను కాపాడాలని సంఘం నాయకులు కోరారు.1971లో అప్పటి ప్రభుత్వం విద్యార్థుల మానసిక, శారీరక, భావోద్వేగ ఎదుగుదలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసిందని డాటా పేర్కొంది. ప్రస్తుతం ఇంటర్ విద్యను 9, 10 తరగతులతో కలిపితే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవడమే కాకుండా, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యం పాఠశాల స్థాయికి విస్తరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. పారామెడికల్, వృత్తి విద్య, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల మనుగడకు కూడా ముప్పు ఏర్పడుతుందని తెలిపింది.రాష్ట్రంలోని 5,256 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 11, 12 తరగతులను జోడించడం లేదా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 9, 10 తరగతులను సర్దుబాటు చేయడం ఆచరణ సాధ్యం కాదని అభిప్రాయపడింది. తెలంగాణలోని 621 మండలాలకు కేవలం 486 జూనియర్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని, జూనియర్ కళాశాలలు లేని మండలాలను గుర్తించి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కొత్త కళాశాలలు ఏర్పాటు చేయాలని సూచించింది.ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరింది. ప్రాంతీయ, సామాజిక వైవిధ్యాలు అధికంగా ఉన్న తెలంగాణలో విద్యా కేంద్రీకరణకు బదులుగా వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. విద్యా బడ్జెట్‌ను కనీసం 20 శాతానికి పెంచడంతో పాటు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యాన్ని నియంత్రించి విద్యా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ మేరకు డాటా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. మొహినోద్దిన్, ప్రధాన కార్యదర్శి ప్రొ. గోళ్ల రమేష్, ప్రొ. కె. లక్ష్మీనారాయణ, ప్రొ. వెంకటదాసు మారేడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొ. ఎం.ఎన్. నరసయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి లక్ష్మయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ సివిల్ ఇంజనీరింగ్ జాతీయ పురస్కారం అందుకున్న గాదే బుచ్చయ్య

- దోమలపల్లి వాసికి ఢిల్లీలో జాతీయ స్థాయి గుర్తింపు..

బహుజన సాహిత్య అకాడమీ పురస్కారం ప్రదానం





నల్గొండ,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): దోమలపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, సీనియర్ సివిల్ ఇంజనీర్ గాదే బుచ్చయ్యకు అరుదైన జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. బహుజన సాహిత్య అకాడమీ (BSA) ఆధ్వర్యంలో అందించే ఉత్తమ సివిల్ ఇంజనీరింగ్ జాతీయ పురస్కారం2026కు ఆయన ఎంపికయ్యారు.దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ మహాసభలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా గాదే బుచ్చయ్య ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.విద్య, సాహిత్యం, కళల ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. ఈ పురస్కారం తన ఒక్కడికే దక్కిన గౌరవం కాదని, తన స్వగ్రామమైన దోమలపల్లి ప్రజల ఆశీస్సుల ఫలితమని పేర్కొన్నారు. ఈ అవార్డు ప్రజాసేవ పట్ల తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ సమాజ అభ్యున్నతి కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల బీఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు, తెలంగాణ రాష్ట్ర అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న గాదే బుచ్చయ్యకు స్వగ్రామం దోమలపల్లి ప్రజలు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేస్తాం: సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర పోరాటాలు



జవహర్ నగర్ నవంబర్ 15 (పిసీ డబ్ల్యూ న్యూస్):రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సీపీఐ అభ్యర్థులను పోటీకి నిలుపుతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ప్రకటించారు. కాప్రా మండల సీపీఐ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేష్ మాట్లాడుతూ, కార్యకర్తలు బస్తీల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, సోషలిస్టు శక్తులకు ప్రజాదరణ పెరుగుతోందని, సింగరేణి, ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ సాధించిన విజయాలు కార్మికుల మద్దతుకు నిదర్శనమని పేర్కొన్నారు. జవహర్ నగర్‌లో అనేక బస్తీల ఏర్పాటులో సీపీఐ కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు.డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్ సాధన కమిటీల ద్వారా ప్రజా సమస్యలపై పార్టీ ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి అధికారులకు వినతిపత్రాలు అందించాలని, పరిష్కారమయ్యే వరకు పోరాటాలు కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నర్సింలు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, సీనియర్ నాయకులు దశరథ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి. వెంకటాచారి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, శాఖ కార్యదర్శులు కె. సత్యం, కె. రాజు, పి. కిరణ్ కుమార్, నాయకులు పి. నరసింహ, డి. భాస్కర్ రావు, డి. నాగేష్, వి. ప్రసాద్, డి. మల్లిక, బి. అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు



కరీంనగర్, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్):బీజేపీ కరీంనగర్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రమావత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో భగవాన్ బిర్సా ముండా జయంతి, జాతీయ గిరిజన గౌరవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి, అటవీ హక్కులు, ఆదివాసీల ఆత్మగౌరవం కోసం బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన త్యాగాలకు గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం జయంతిని జనజాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించడం గిరిజన సమాజానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం, విద్య, ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు చేరవేయాలని ఎస్టీ మోర్చా నాయకులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొట్టే మురళీకృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు గాజుల స్వప్న, కార్పొరేటర్లు బండ రమణ, జాడి బాల్ రెడ్డి, మొగిలి శ్రీనివాస్, లావుడియా తిరుపతి నాయక్, బానోత్ శివ నాయక్, మాలోతు దీక్షిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి

- జీవనశైలిలో మార్పులతోనే వ్యాధికి అడ్డుకట్ట: మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్): మధుమేహం భారతదేశంలో నిశ్శబ్ద హంతకిగా మారుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ సూచించారు. భారత్‌లో సుమారు 100 మిలియన్ల మంది మధుమేహంతో బాధపడుతుండటం ఆందోళనకరమన్నారు.లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన మధుమేహ అవగాహన ర్యాలీని మేయర్ శ్రీనివాస్, జిల్లా గవర్నర్ మోరె భద్రేశంతో కలిసి తెలంగాణ కూడలిలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శారీరక వ్యాయామం, సమతుల ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు.జిల్లా గవర్నర్ మోరె భద్రేశం మాట్లాడుతూ జిల్లా పరిధిలోని వందకు పైగా లయన్స్ క్లబ్బులు నవంబర్ నెలలో మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ కూడలి నుంచి బస్టాండ్ మీదుగా టవర్ సర్కిల్ వరకు సాగిన ర్యాలీలో సభ్యులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం టవర్ సర్కిల్ వద్ద ప్రజలకు మధుమేహ నివారణపై సూచనలు చేశారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ గుండోజు లక్ష్మయ్యతో పాటు పీడీజీ హెచ్. రాజిరెడ్డి, బుర్ర మధుసూదన్ రెడ్డి, వివిధ లయన్స్ క్లబ్బుల సభ్యులు పాల్గొన్నారు.

వడ్డీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం: సేవా మైక్రోస్

- కరీంనగర్‌లో ప్రెస్‌మీట్.. 46 ప్రాంతాల్లో వడ్డీ లేని రుణాల పంపిణీ



కరీంనగర్,నవంబర్15(పిసి డబ్ల్యూ న్యూస్): సర్వత్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా మైక్రోస్ సంస్థ ద్వారా వడ్డీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నవంబర్ 9 నుంచి 23 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 15 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. “మనందరి ఒకే కల.. వడ్డీ రహిత సమాజం” అనే నినాదంతో ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ సేవా మైక్రోస్ బ్రాంచ్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కరీంనగర్ సేవా మైక్రోస్ అధ్యక్షుడు మహమ్మద్ ఖైరుద్దీన్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 46 ప్రాంతాల్లో సేవా మైక్రోస్ విజయవంతంగా చిన్న, మధ్యతరహా వ్యాపారులకు వడ్డీ లేని రుణాలను అందిస్తోందని తెలిపారు.సేవా మైక్రోస్ సొసైటీ లేని ప్రాంతాల్లో కొత్తగా శాఖలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, అలాగే సంస్థలో సభ్యుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.అనంతరం సేవా మైక్రోస్ కరీంనగర్ బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హామిద్ అలీ మాట్లాడుతూ.. బ్రాంచ్ పనితీరు, సంస్థ లక్ష్యాలు, అందిస్తున్న సేవల గురించి వివరించారు.ఈ ప్రెస్‌మీట్‌లో సేవా మైక్రోస్ కరీంనగర్ మేనేజర్ ఖైరుద్దీన్, రికవరీ ఆఫీసర్ అబ్దుల్ ఖదూస్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యుడు సయ్యద్ మస్తాన్, అకౌంటెంట్ బాసిమ్, సేవా సొసైటీ సభ్యుడు లియాఖత్ అలీ వార్సీ, సేవా మైక్రోస్ కరీంనగర్ కార్యదర్శి అజీజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ

- పెళ్లిరోజు వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించిన రవికుమార్ దంపతులు





కరీంనగర్, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్): వివాహ వార్షికోత్సవాన్ని ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమంతో జరుపుకుంటూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జిల్లా రవికుమార్ దంపతులు ఆదర్శంగా నిలిచారు. కరీంనగర్‌లోని కపిల్ బాలకుటీర్‌లో 110 మంది విద్యార్థులకు 110 దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ వివాహ వార్షికోత్సవాన్ని బాలబాలికల మధ్య సేవా కార్యక్రమంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. చలికాలంలో పిల్లలు ఆరోగ్య సమస్యల బారిన పడకుండా వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.కోల అన్నారెడ్డి, జోనల్ ఆఫీసర్ పుల్లాల శ్యామ్ మాట్లాడుతూ ప్రత్యేక సందర్భాలను అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రవికుమార్ దంపతులు, డాక్టర్ శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, పుల్లాల శ్యామ్, బల్మూరి కరుణాకర్ రావు, వకుల దేవి, గట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లక్ష్యంగా ముందుకు వస్తున్నా..ఆశీర్వదించండి

● కేజీ నుండి పీజీ విద్యాసంస్థల యాజమాన్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఏకశిల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి



హనుమకొండ,నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): విద్యారంగంలో దశాబ్దాల పాటు అలుపెరగని కృషి చేసి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన తాను, ఇప్పుడు సమాజ సేవే పరమావధిగా ప్రజల ముందుకు వస్తున్నానని, విద్యాసంస్థల యాజమాన్య మిత్రులందరూ నిండు మనసుతో ఆశీర్వదించి అండగా నిలవాలని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం హనుమకొండలోని ఒక ప్రైవేట్ వేదికల మందిరంలో ‘కేజీ నుండి పీజీ విద్యాసంస్థల యాజమాన్య మిత్రుల ఆత్మీయ సమ్మేళనం’ అత్యంత ఉత్సాహభరితమైన, ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు, విద్యారంగ ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. **రైతు బిడ్డగా మొదలై.. విద్యా దిగ్గజంగా ఎదిగి..** ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరు తిరుపతిరెడ్డి తన జీవన ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. తాను ఒక సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణ, కష్టపడే తత్వమే తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందని తెలిపారు. విద్యారంగంపై ఉన్న మక్కువ, సమాజానికి నాణ్యమైన విద్యను అందించాలనే పట్టుదలతో 2002వ సంవత్సరంలో హన్మకొండలో ఒక చిన్న పాఠశాలతో తన ప్రయాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నాడు ఒక్క పాఠశాలతో వేసిన చిన్న విత్తనం, నేడు మహావృక్షంలా 22 బ్రాంచులుగా విస్తరించడం వెనుక ఎంతో మంది కృషి, తల్లిదండ్రుల నమ్మకం ఉందన్నారు. ప్రస్తుతం ఏకశిల విద్యాసంస్థల్లో 3 వేల మందికి పైగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర బృందం పనిచేస్తుండగా, సుమారు 16 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు తమ విద్యాసంస్థల ద్వారా 50 వేల మందికి పైగా విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడటం తనకు ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. **తోటి యాజమాన్యాల సహకారం మరువలేనిది** విద్యారంగంలో తాను ఎదుగుతున్న క్రమంలో తోటి విద్యాసంస్థల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు అందించిన సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని తిరుపతిరెడ్డి కొనియాడారు. పోటీతత్వం కంటే పరస్పర సహకారంతోనే విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందని తాను ఎప్పుడూ విశ్వసిస్తానని, జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధం తన జీవితంలో అత్యంత విలువైన సంపదని అన్నారు.**ప్రజల ఆశీస్సులే కొండంత బలం** భవిష్యత్తు కార్యాచరణపై మాట్లాడుతూ.. విద్యారంగంలో సంపాదించిన అనుభవం, క్రమశిక్షణతో ఇకపై సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలనే దృఢ సంకల్పంతో ముందుకు అడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. పేద, మధ్యతరగతి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు. తన ఈ కొత్త ప్రయాణంలో విద్యాసంస్థల యాజమాన్య మిత్రులందరూ వెన్నంటి ఉండి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆశీస్సులు, మిత్రుల అండదండలే తనకు కొండంత బలమని ఆయన పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పలువురు విద్యాసంస్థల కరస్పాండెంట్లు మాట్లాడుతూ.. గౌరు తిరుపతిరెడ్డి క్రమశిక్షణ, సేవా దృక్పథం అందరికీ ఆదర్శమని కొనియాడుతూ, ఆయన భవిష్యత్తు ప్రయాణానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం నిర్వాహకులు తిరుపతిరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ విద్యా సంస్థల చైర్మన్లు వరదా రెడ్డి, దేవేందర్ రెడ్డి, తిరుమల రావు, నారాయణ రెడ్డి, రాజి రెడ్డి, తాళ్ళపల్లి స్వామి, షైన్ కుమార్,రామ్మూర్తి, భగవాన్ రెడ్డి, నాగార్జున రెడ్డి, రమేశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

అనుభవానికే అగ్రస్థానం.. లచ్చిరాం నాయక్‌కు

ఐదోసారి బాధ్యతలు




● మహబూబాబాద్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ , నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): మహబూబాబాద్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇస్లావత్ లచ్చిరాం నాయక్ వరుసగా ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సంఘం కౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ లచ్చిరాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందుల శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఐదోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా



ప్రధానోపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ప్రధానోపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.నూతన కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా తానంచర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితా దేవి, కోశాధికారిగా తాళ్లపూసపల్లి ప్రధానోపాధ్యాయులు కనకయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కల్వల ప్రధానోపాధ్యాయులు నరేందర్, చిట్యాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి తుమ్మ వెంకటేశ్వర్లు, పూర్వ కోశాధికారి సమ్మెట వెంకటేశ్వర్లు, పూర్వ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వాంకుడోతు బాలాజీ, సంఘ గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వివిధ మండలాల విద్యాశాఖ



అధికారులు, జిల్లాలోని పలువురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జిగా

నల్లమోతు అనిత చౌదరి నియామకం!

16 ఏళ్లుగా కల్వకుంట్ల కవితతో కలిసి ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర.. సేవలకు తగిన గుర్తింపు

ఖమ్మం, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్):తెలంగాణ రక్షణ సేన ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జిగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనరసింహపురం గ్రామానికి చెందిన నల్లమోతు అనిత చౌదరి నియమితులయ్యారు. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ఈ మేరకు అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు.గత 16 సంవత్సరాలుగా కల్వకుంట్ల కవితతో కలిసి అనిత చౌదరి అనేక ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత, మహిళా జాగృతి, రాజకీయ రంగంలో మహిళలకు సముచిత ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రస్థాయిలో పలు



ఉద్యమాలు, కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల హక్కుల పరిరక్షణ, వారి రాజకీయ భాగస్వామ్యం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేశారు.గతంలో తాను చేసిన సేవలు, ప్రజా ఉద్యమాల్లో పోషించిన పాత్రకు గుర్తింపుగా ఈ బాధ్యత లభించడం సంతోషంగా ఉందని నల్లమోతు అనిత చౌదరి తెలిపారు. తనపై నమ్మకంతో ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జిగా నియమించిన తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ బాధ్యత ద్వారా ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారానికి, మహిళల అభ్యున్నతికి మరింత అంకితభావంతో పనిచేస్తానని అనిత చౌదరి పేర్కొన్నారు

అట్టహాసంగా మున్నూరుకాపుల వన సమారాధన

ఐక్యతతోనే రాజకీయ ప్రాతినిధ్యం, పదవులు సాధ్యం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, నవంబర్ 15 (ప్రతినిధి, పీసీడబ్ల్యూ న్యూస్): మున్నూరుకాపుల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటుతూ ఖమ్మం నగరంలో వన సమారాధన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా కుల బాంధవులు తరలివచ్చారు. పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొని బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధనపై ప్రసంగించారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఐకమత్యమే మన అసలైన బలమని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితే పదవులు, అవకాశాలు వాటంతటవే వస్తాయన్నారు. పరస్పర విభేదాలతో ఐక్యతను దెబ్బతీసుకోవద్దని సూచించారు. సేవాభావం, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ప్రజల పట్ల అంకితభావం ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కోకాపేటలో మున్నూరుకాపుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.ప్రభుత్వ సలహాదారు వీ.





హనుమంతరావు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ మున్నూరుకాపుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని, హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని సూచించారు.మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ వన సమారాధన వంటి కార్యక్రమాల ద్వారా ఐక్యతను చాటుతూ రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ కుల ఆత్మగౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ భావితరాలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ఐక్యత అవసరమన్నారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కాపులు, మున్నూరుకాపులు అన్నదమ్ముల్లా కలిసి రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని కోరారు.సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ఆకుల రాజయ్య, ఎడవల్లి కృష్ణ, కొడిమ్యాల మధుసూదన్, మరిశెట్టి రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ స్వాగతం పలుకగా, జిల్లా అధ్యక్షుడు శీలంశెట్టి వీరభద్రం అధ్యక్షత వహించారు.మున్నూరుకాపు సమాజానికి విశేష సేవలందించిన దివంగత ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. 'జై తెలంగాణ', 'మున్నూరుకాపుల ఐక్యత వర్ధిల్లాలి', 'జై బీసీ' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి

- **సోమవారం ఖమ్మం కార్పొరేషన్ ఎదుట సీపీఎం ధర్నా..**

జయప్రదం చేయండి: వై. విక్రమ్




ఖమ్మం, నవంబర్ 15 (ప్రతినిధి, పీసీడబ్ల్యూ న్యూస్): రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం టూ టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ కొద్దిమందికే కొత్త పెన్షన్లు మంజూరు చేయడం సరికాదన్నారు. పెన్షన్ మొత్తాన్ని రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు.అధికారులు ప్రతి డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించి, ఎలాంటి రాజకీయ పక్షపాతం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బోడపట్ల సుదర్శన్, జె. వెంకన్నబాబు, సీహెచ్. బద్రం, శెట్టి రవీంద్ర, ఎస్.కె. హుస్సేన్, మల్లికార్జున్ రెడ్డి, భూక్యా ఉపేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల ఐక్యతే సామాజిక ప్రగతికి బాట

- అవకాశవాద రాజకీయాలకు స్వస్తి.. ఐక్యతతోనే అస్తిత్వం
- ఖమ్మం కార్పొరేషన్‌పై కాపుల నాయకత్వ పతాకం ఎగరాలి : తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండాల కృష్ణ
- రాజకీయ ప్రాతినిధ్యంపై గళమెత్తిన నాయకులు.. అంబటి రాంబాబు సంఘీభావం









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్): సంఘం అంటే కేవలం ఏటా వనభోజనాలు చేసుకోవడం కాదని, ఆపదలో ఉన్న కులబాంధవులకు అండగా నిలవడమే అసలైన లక్ష్యమని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండాల (ఆర్జీసీ) కృష్ణ స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కులాన్ని విభజించే అవకాశవాద రాజకీయాలకు దూరంగా ఉంటూ, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమష్టిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని కాళ్ల రామారావు మామిడితోటలో తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం, జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధనకు ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన గుండాల కృష్ణ మాట్లాడుతూ.. గతంలో మేకల సంగయ్య సంఘం కోసం సమకూర్చిన ఆస్తులు ప్రస్తుతం కొందరి ఆధీనంలో ఉన్నాయని, వాటి నిర్వహణపై ఆయన స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11 ఏళ్లుగా ఒకే వ్యక్తి నాయకత్వంలో ఉన్నా కుల సమస్యలపై చర్చ జరగలేదని విమర్శించారు. 2014లో కేసీఆర్ తనకు టికెట్ ఇచ్చినప్పుడూ, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్నప్పుడూ సొంత కులానికి చెందిన కొందరే తనపై కుట్రలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విభేదాలు పక్కనపెట్టి రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో మున్నూరు కాపుల నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు.మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత కాపుల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయిందని, ప్రస్తుత తెలంగాణ మంత్రివర్గంలో ఒక్క కాపు నేతకు కూడా చోటు లేకపోవడం బాధాకరమన్నారు. మంద కృష్ణ మాదిగ తరహాలో హక్కుల సాధన కోసం సంఘటితంగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.ముఖ్య అతిథి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజల మధ్య అనుబంధం చెరిగిపోదన్నారు. తనపై దాడి జరిగినప్పుడు తెలంగాణ కాపులు అందించిన నైతిక మద్దతు మరువలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయ పార్టీలు వేరైనా కష్టకాలంలో కులబాంధవులంతా ఒకే కుటుంబంలా నిలవాలని, ఎలాంటి ఆపద వచ్చినా కాకితో కబురంపినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆర్జీసీ కృష్ణ ఐక్యత కోసం చేస్తున్న కృషిని అభినందించారు.ఈ కార్యక్రమ ప్రారంభంలో ఇటీవల మరణించిన సంఘ నాయకులు శభాసు శ్రీనివాస్, ఎర్ర శ్రీకాంత్, పొదిల దేవేందర్‌లకు మౌనం పాటించి నివాళులర్పించారు. యాంకర్ నీరజారెడ్డి వ్యాఖ్యానం, గాయకుడు సంపత్ పాటలు, చిన్నారులు హర్షిత, కీర్తనల భరతనాట్యం ఆకట్టుకున్నాయి.ఈ వేడుకలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, కడవకొల్లు నరసింహారావు, బచ్చు విజయకుమార్, లక్కినేని రఘు, బచ్చు మధు, ఆకుల మూర్తి, పొన్నం వెంకటేశ్వర్లు, మూలగుండ్ల శ్రీహరి, పిన్ని కోటేశ్వరరావు, లక్కినేని సుధీర్, మడూరి సైదారావు, కనకం భద్రయ్య, రంగరాజు ఊర్మిళ, మాటేటి కిరణ్, ఎర్ర జ్ఞానేశ్, ఎర్ర అప్పారావు తదితరులతో పాటు గౌడ, పద్మశాలి సంఘ నేతలు కత్తి నెహ్రూ గౌడ్, బొమ్మ రాజేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు: రూరల్ సీఐ పంజాల సర్వయ్య





కల్లూరు, నవంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :పట్టణంలో చోరీకి పాల్పడిన ఓ నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తెలిసిన వారి ఇంట్లోనే తాళం చెవి సహాయంతో లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన నిందితుడిని వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని రూరల్ సీఐ పంజాల సర్వయ్య విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 15వ తేదీ ఉదయం కల్లూరు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఎన్ఎస్పీ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తిరువూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వెంబడించి పట్టుకున్నారు.విచారణలో అతడు ఖాన్ ఖాన్ పేటకు చెందిన భరోతు నాగ వెంకటేశ్వర్లు అలియాస్ చంటిగా గుర్తించారు. గతంలో అజ్మీరా నరసింహ ఇంట్లో కరెంట్ మీటర్ వెనుక ఉంచిన తాళం చెవిని తీసుకుని ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన ఆభరణాల్లో ఒక జత బంగారు జూకాలను కల్లూరులోని విజయకృష్ణ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి రూ.30 వేల నగదు తీసుకున్నట్లు, మిగిలిన ఆభరణాలను బైక్ ట్యాంక్ కవర్‌లో దాచి తిరువూరులో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి సుమారు 12 గ్రాముల బంగారు ఆభరణాలు, 230 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు నేరానికి ఉపయోగించిన రిజిస్ట్రేషన్ నంబర్ లేని హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫైనాన్స్ వ్యాపారి వద్ద తనఖా పెట్టిన బంగారు జూకాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.మొత్తంగా సుమారు రూ.1 లక్షా 20 వేల విలువైన సొత్తును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఐక్యతే బలం

- సంక్షేమం, హక్కుల సాధనే సంఘం లక్ష్యం







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్): గ్రామీణ వైద్యుల సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణే తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం ప్రధాన ధ్యేయమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నరేష్ అన్నారు. ఐక్యతతోనే సమస్యల పరిష్కారం, హక్కుల సాధన సాధ్యమని పిలుపునిచ్చారు.ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లూరి నరసింహారావు, అధికార ప్రతినిధి అన్నవరపు నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలందిస్తున్న వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం బలోపేతం, సభ్యుల సంక్షేమం, హక్కుల సాధన, ప్రభుత్వానికి సమర్పించాల్సిన డిమాండ్లపై చర్చించారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని నిర్ణయించారు.సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మర్రి నరేష్, ఉపాధ్యక్షుడు చాపలమడుగు నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు శీలం బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోదుగు సుధాకర్, కోశాధికారి కమర్తపు వీర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృథా వస్తువులతో సేవా సందేశం



పోడార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'టర్నింగ్ వేస్ట్ టు వావ్' కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 14 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): రంగీన్ యువ సేవ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని పోడార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'టర్నింగ్ వేస్ట్ టు వావ్' పేరుతో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ముగింపు వేడుకల్లో



భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. వినియోగంలో లేని వస్తువులను వృథా చేయకుండా అవసరమైన వారికి అందించి సద్వినియోగం చేయడమే కార్యక్రమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, దాతృత్వం, సామాజిక బాధ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

‘నశా ముక్త్ భారత్’ కోసం హైదరాబాద్‌లో 3 రోజుల వాకథాన్



హైదరాబాద్, నవంబర్ 15(పి సి డబ్ల్యూ న్యూస్): మాదకద్రవ్యాల మహమ్మారిపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 24, 25, 26 తేదీల్లో (ఉదయం 9 నుండి సాయంత్రం 6 వరకు) హైదరాబాద్‌లో భారీ ‘నశా ముక్త్ భారత్ వాకథాన్’ నిర్వహించనున్నారు. వేలాది మంది విద్యార్థులు, యువత, పౌరులు పాల్గొనే ఈ యాత్రలో ప్లకార్డుల ప్రదర్శన, వీధి సభలతో పాటు వ్యసనం నుండి బయటపడిన వారి స్ఫూర్తిదాయక అనుభవాలను పంచుకోనున్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లపై కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డితో సమన్వయ సమావేశం జరగనుంది. ఈ ఉద్యమానికి మద్దతుగా జస్మత్ పటేల్ (తెలంగాణ గుజరాతీ సమాజ్), రిద్ధిష్ జాగిర్దార్ (కచ్ఛి మిత్ర మండల్), విజయ్ సురానా, గౌతమ్ గాంధీ (జైన్ సమాజ్), అవినాష్ దేవ్దా (కిరాణా & జనరల్ మర్చంట్ అసోసియేషన్), మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, బిజెపి నాయకురాలు బంగారు శ్రుతి తదితర ప్రముఖులు పాల్గొని సంఘీభావం తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి నగరవాసులంతా ఈ వాకథాన్‌లో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

చలో జనగామ సదస్సును విజయవంతం చేయాలి

● బంజారా, లంబాడీల హక్కుల కోసం నవంబర్ 29న రాష్ట్రస్థాయి సమావేశం



సత్తుపల్లి, నవంబర్ 15 (పీసీడబ్ల్యూ న్యూస్):బంజారా, లంబాడీ గిరిజనుల హక్కుల సాధన కోసం ఈ నెల 29న జనగామలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గూగులోతు కృష్ణా నాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు.ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎన్టీఆర్ నగర్‌లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయక్ ఆధ్వర్యంలో ‘చలో జనగామ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తండాల అభివృద్ధి, గిరిజన భూములకు హక్కు పట్టాలు, విద్యా, ఉద్యోగ, సాంస్కృతిక హక్కుల పరిరక్షణ లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక తండా అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ, గోర్బోలి భాషకు ఎనిమిదో షెడ్యూల్‌లో గుర్తింపు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో పండు నాయక్, రోశయ్య నాయక్, బీరప్ప, ధరావత్ రవి నాయక్, నాగేంద్ర నాయక్, అర్జున్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే


విజ్ఞాన వికాసం

● గ్రంథాలయాలు జ్ఞాన మందిరాలు: ఎండీ ఖాదర్ బాబా





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా పిలుపునిచ్చా రు. ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రంథాల యానికి నిరంతరం వస్తూ పఠనంపై ఆసక్తి కనబరుస్తున్న సీనియర్ పౌరులను సన్మానించారు. అనంతరం నిర్వహించిన బుక్ రీడింగ్ డ్రైవ్, బుక్ టాక్ కార్యక్రమాల్లో పుస్తక పఠనం, వ్యక్తిత్వ వికాసం, సమాజ అభివృద్ధిలో సాహిత్యం పాత్రపై చర్చించారు.ఖాదర్ బాబా మాట్లాడుతూ విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని సూచిం చారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే జ్ఞాన మందిరాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, లైబ్రేరియన్లు సి. మల్సూర్, బాబు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తొలి లఘుచిత్రానికే ఉత్తమ దర్శకురాలి పురస్కారం.. శ్రీజ సాదినేని ఆనందం

47 నాటకాలకు దర్శకత్వం వహించి.. తొలి ప్రయత్నంలోనే అంతర్జాతీయ గుర్తింపు వెండితెరపై దర్శకురాలిగా పేరు చూసుకోవడమే జీవిత లక్ష్యమని వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్): రంగస్థలంపై తనదైన ముద్ర వేసిన రచయిత్రి, దర్శకురాలు శ్రీజ సాదినేని ఇప్పుడు వెండితెరపై తన కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే 47 నాటకాలకు దర్శకత్వం వహించిన ఆమె, తొలిసారిగా రూపొందించిన ‘కంచె చేను మేస్తే’ లఘుచిత్రానికి రెయిన్‌బో అంతర్జాతీయ బాలల ఏడవ చలనచిత్రోత్సవంలో ఉత్తమ దర్శకురాలి పురస్కారం లభించింది. తొలి ప్రయత్నంలోనే ఈ అంతర్జాతీయ గుర్తింపు దక్కడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శ్రీజ సాదినేని మాట్లాడుతూ తనకు లభించిన ప్రతి పురస్కారం వెనుక ఎంతో శ్రమ, అనుభవం, సుదీర్ఘ ప్రయాణం ఉన్నాయని పేర్కొన్నారు.



లఘుచిత్ర దర్శకురాలిగా తొలి అడుగులోనే ఉత్తమ దర్శకురాలి పురస్కారం అందుకోవడం తనకు ఎంతో ప్రత్యేకమని తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన ప్రదర్శన సందర్భంగా పెద్ద తెరపై ‘దర్శకత్వం: శ్రీజ సాదినేని’ అని తన పేరును చూసుకున్న క్షణం ఆనందంతో కళ్లలో నీళ్లు తిరిగాయని గుర్తుచేసుకున్నారు. చిత్రాన్ని చూసిన ప్రేక్షకులు భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం, వేదికపై ప్రత్యేకంగా ప్రశంసించడం తనలో మంచి సినిమాలను తెరకెక్కించగలననే ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. భవిష్యత్తులో వెండితెరపై దర్శకురాలిగా తన పేరును చూసుకోవాలన్నదే జీవిత ఆశయమని, మంచి కథలతో మహిళా దర్శకురాలిగా చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.**శిష్యులతో కలిసి తొలి ప్రయత్నం..**ఇటీవల తాను నటించిన ‘గరివిడి లక్ష్మి’ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించిందని, నటిగా అవకాశాలు వస్తున్నప్పటికీ కెమెరా వెనుక ఉండి కథను తెరకెక్కించడంలోనే తనకు ఎక్కువ సంతృప్తి ఉందని శ్రీజ స్పష్టం చేశారు. ‘కంచె చేను మేస్తే’ లఘుచిత్రంలో నటించినవారు, డబ్బింగ్ చెప్పినవారు అందరూ తన విద్యార్థులేనని తెలిపారు. గురువుగా తాను నటన నేర్పిన విద్యార్థులతో కలిసి రూపొందించిన తొలి చిత్రానికే పురస్కారం రావడం తన ఆనందాన్ని రెట్టింపు చేసిందన్నారు. ఈ పురస్కారానికి తనను ఎంపిక చేసిన నిర్ణేతల మండలికి, రెయిన్‌బో బాలల చలనచిత్ర సమాఖ్య నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

డబ్బులు ఆదా చేసుకోండి... ఆరోగ్య వంతులుగా జీవించండి

● బీబీనగర్ ప్రధాన రహదారిలో ఓపి 10 రూపాయల ఎయిమ్స్ ఆస్పత్రి ● రోగులను శ్రద్ధగా చూసే వైద్యులు. రోజుకు వందల సంఖ్యలో వైద్య పరీక్షలు ● ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద ఆర్టీసీ బస్సులు ఆపబడతాయి







తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్)తిరుణహరి మనోహర స్వామి: పల్లె ప్రాంతాలలో ఏదైనా అనారోగ్యానికి గురైతే మొదట చూసేది ఆర్ఎంపీ వైద్యులే. అక్కడ వారితో కానీ వైద్యం ఏమైనా ఉంటే పెద్ద ఆసుపత్రికి పంపిస్తారు.పేదవారికి పెద్దగా అనారోగ్యానికి గురైనప్పుడు చేతిలో డబ్బులు లేని సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతుంటారు. ప్రైవేటు ఆసుపత్రిలో అనేక డబ్బులను చెల్లించలేక అనేక అవస్థలు పడుతుంటారు నిరుపేద కుటుంబాలు. వందలు , వేలు, లక్షల రూపాయలు హెచ్చించలేక అనేకమంది కుటుంబాలు ప్రాణాలు విడిచిన సందర్భాలు లేకపోలేదు?. నిరుపేద కుటుంబాలకు ఈ ఆసుపత్రి వైద్య సేవలు ఒక వరంగా భావించవచ్చు. ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎయిమ్స్ ఆసుపత్రి బీబీనగర్ హైదరాబాద్ కు వెళ్ళండి. డబ్బులు ఆదా చేసుకోండి ఆరోగ్య వంతులుగా జీవించండి. అక్కడ ఓపి 10 రూపాయలు మాత్రమే. అనారోగ్యవంతులకు (రోగులకు) వైద్యులు అందించే వైద్య సేవ మాటల్లో చెప్పలేని విధంగా ఉంటుంది. ఆసుపత్రి లోపల తిరిగేందుకు బ్యాటరీ ఆటోలు, మినీ బస్సులు ఉచితంగా తీసుకువెళ్తుంటాయి. దూర ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులు వచ్చే ప్రయాణికుల కొరకు హైవేపై రోడ్డు దాటించేందుకు ఇరువైపులా నలుగురు సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు గమనించండి. తొందరపడి రోడ్డున దాటవద్దు ప్రమాదాలకు గురవుతారు. మొదటిసారిగా ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లే వారికి వారు పాటించాల్సిన విషయాలు ఇవి. ప్రధాన గేటు నుండి లోపలికి వెళ్ళిన అనంతరం ఎడమ వైపుకు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడ (ఏ)బ్లాక్ లో ఓపి తీసుకోవాలి. మీకున్న అనారోగ్య విషయాలు వారికి తెలిపితే మీకు సంబంధించిన వైద్యులు ఏ ప్రాంతంలో ఉంటారు అక్కడ సెక్యూరిటీని అడిగి తెలుసుకోవాల్సిందే. ముఖ్య గమనిక, మొదటిసారి ఎయిమ్స్ కి వెళ్లే ఎవరైనా సరే వైద్యులను సంప్రదించాలనుకునేవారు తప్పనిసరిగా లీటర్ వాటర్ బాటిల్ తినుబండారాలు తీసుకువెళ్లాల్సిందే. ఆసుపత్రి లోపల ఏమి దొరకవు. ఆస్పత్రి సమయం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. భోజన విరామ సమయం 1.00 నుండి 2.00 వరకు ఉంటుంది. వైద్య పరీక్షలు అయినంత అయిన తర్వాత తిరిగి లోపల నుండిబస్టాండ్ కు వచ్చే వారికి అక్కడే ఒక తెల్ల బస్సు కనిపిస్తుంది దానిలో ఆర్టీసీ బస్టాండ్ వరకు తీసుకువస్తారు గమనించండి. భువనగిరి నుండి 14 కిలోమీటర్ల దూరంలో ఆసుపత్రి ఉంటుంది. భువనగిరి నుండి ఆర్టీసీ బస్సులో 60 రూపాయలు ఛార్జ్. అనారోగ్య వంతులుగా ఎవరు వెళ్ళినా సరే వారి వెంట మరొక వ్యక్తిని తీసుకు వెళ్లాల్సి ఉంటుంది వారితో పాటు ఆధార్ కార్డులు కూడా అవసరం. వైద్య పరీక్షలకు, ఆపరేషన్లకు అతి తక్కువ డబ్బులతో చూయించుకోవచ్చు. మందుల కొరకు లోపల జనరిక్ మెడికల్ షాప్ కలదు. ఇతర జిల్లాల నుండి హైదరాబాదుకు వెళ్లాల్సిన ప్రయాణికుల కొరకు ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద బస్టాండ్ ఏర్పాటు చేశారు. పల్లె వెలుగు ,ఎక్స్ప్రెస్ బస్సులను అక్కడ ఆపుతారు. ప్రధాన రహదారిలోనే ఆసుపత్రి కలదు. మహబూబాబాద్ జిల్లా టీ జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ నుండి వెళ్ళే రోగులకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ లో ఉదయం 5 గంటలకు బయలుదేరి బస్సు వెళ్లే గ్రామాలు నెల్లికుదురు, మడిపల్లె, గుర్తూరు కు ఉదయం 6 గంటలకు చేరుతుంది. ఊకళ్ళు, గట్టి కళ్ళు, రాయపర్తి, కొండూరు, బురాన్ పల్లి, కొలనుపల్లి, దుద్దెడ, పాలకుర్తి 7.30, జనగాం, ఆలేరు, భువనగిరి ద్వారా ఎయిమ్స్ ఆసుపత్రికి 10.30 చేరుకుంటుంది. ఎయిమ్స్ ఆసుపత్రి కొరకు ప్రత్యేకంగా వేసిన బస్సు ప్రారంభించిన నెల రోజుల నుండి విజయవంతంగా కొనసాగుతున్నందుకు ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సును వేయించేందుకు శ్రమ పడిన వారి అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఆయా గ్రామస్తులు. కేంద్ర ప్రభుత్వం వారిని ద్వారా నిర్వహించబడుతున్న ఈ ఆసుపత్రికి అనేకమంది రోగులు వస్తూ సేవలందికుంటున్నారు. అనారోగ్య వంతులుగా వెళ్ళండి ఆరోగ్యవంతులుగా తిరిగి రండి.

కొత్తూరులో ఘనంగా ప్రారంభమైన చత్ మహాపర్వ్



హాజరై ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్



షాద్ నగర్,నవంబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):ప్రకృతి మాతను,సూర్య భగవానుడిని ఆరాధించే అత్యంత పవిత్రమైన జాతీయ పండుగ ‘చత్ పండుగని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఛట్ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ..సూర్యారాధనకు ప్రతీకగా నిలిచే ఈ మహాపర్వం ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు.ముఖ్యంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన కోట్లాది మంది భక్తులు ఈ పండుగను అత్యంత భక్తిభావంతో జరుపుకుంటారని ఆయన అన్నారు.నదులు,జలాశయాల వద్ద ప్రత్యేక ఘాట్‌లను ముస్తాబు చేసి, సూర్యోదయం,సూర్యాస్తమయ వేళల్లో అర్ఘ్య ప్రధానం చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ కౌన్సిలర్ మాదారం నర్సిములు గౌడ్,సోమ్లా నాయక్, జె. శ్రీనివాస్ గౌడ్,నాయకులు సిటీ కేబుల్ వెంకటేష్,శివ చారి,జంగగళ్ల అనిల్,శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

చిటికెన వేలిపై గోవర్ధన గిరిని మోసిన కృష్ణుడు- 'గోవిందా' నామం వెనక ఉన్న అసలు కథ ఇదే!



భగవంతుడైన శ్రీకృష్ణుడు గోకులంలో ఎన్నో లీలావిలాసాలు చేసాడు. అందులో ఒకటి గోవర్ధనోద్ధారణ! గర్వంతో శ్రీకృష్ణుడు భగవంతుడనే విషయాన్ని మర్చిపోయిన ఇంద్రునికి గుణపాఠం నేర్పడానికి శ్రీకృష్ణుడు చేసిన గోవర్ధనోద్ధార లీలా విశేషాలను గోవర్ధన పూజ అని, అన్నకూట్ అని జరుపుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ సందర్భంగా గోవర్ధన పూజ ఎప్పుడు? ఆ రోజు ఎవరిని పూజించాలి? ఈ పూజ వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? విషయాలు తెలుసుకుందాం.

గోపాలకృష్ణుని లీలలు

శ్రీకృష్ణుడు గోకులంలో ఉండేటప్పుడు ఎన్నో బాల్యక్రీడలు చేసాడు. సాక్షాత్తు భగవంతుడైన శ్రీ కృష్ణుడు సాధారణ గోవుల కాపరిలాగా గోపాలకులతో కలిసి గోవులను మేపుతూ, వారితో కలిసి చల్దులు ఆరగిస్తూ గడిపేవాడు. ఈ క్రమంలో బాల కృష్ణుడు అనేక లీలలు ప్రదర్శించాడు. గోపాలకుల నిర్మల భక్తికి ప్రసన్నుడైన కృష్ణుడు నిరంతరం వారితో కలిసి మెలిసి తిరుగుతుండేవాడు.ఇంద్రయాగమన పురాణాల ప్రకారం ఇంద్రుడు వర్షాలు కురిపించే దేవుడు. ద్వాపర యుగానికి పూర్వం వరకు ప్రజలంతా వర్షాల కోసం ఇంద్రయాగం చేసేవారు. ఆ ఇంద్రయాగంతో సంతృప్తి చెందిన ఇంద్రుడు సమృద్ధిగా వర్షాలు కురిపించేవాడు, దాంతో పంటలన్నీ చక్కగా పండుతూ ఎలాంటి కరువు కాటకాలు లేకుండా అందరూ ఆనందంగా జీవించేవారు.

ఇంద్రుని గర్వం

ఈ విషయంలో ఇంద్రునికి కొంత గర్వం ఉండేది. ఎంతలా అంటే అందరూ పూజించే శ్రీకృష్ణుడు భగవంతుడే అన్న విషయం విస్మరించి, కృష్ణుడు కూడా తనను పూజించాలని అని అనుకునే వరకు ఆ గర్వం పెరిగింది. ఈ విషయాన్ని గమనించిన కృష్ణుడు ఇంద్రుని గర్వం అణిచి అతనికి బుద్ధి చెప్పాలనుకున్నాడు.

గోవర్ధన పర్వతాన్ని పూజించమన్న కృష్ణుడు

ప్రతి ఏడాదిలాగే ఇంద్రయాగం చేయడానికి గోకులంలో ప్రజలంతా సిద్ధమవుతున్నారు. ఇంద్రుని గర్వం అణచడానికి ఇదే సరైన సమయం అని తలచి కృష్ణుడు, గోకుల ప్రజలతో 'ఇకనుంచి మనం ఇంద్రుని పూజించవద్దు. మనకు ఆహారాన్ని, మన పశువులకు గ్రాసాన్ని ఇస్తూ వర్షాలు కురవడానికి సహకరించే ఈ గోవర్ధన పర్వతాన్నే దైవంగా భావిద్దాం. వర్షాల కోసం ఈ గోవర్ధన పర్వతాన్నే మనమందరం పూజిద్దాం' అని అంటాడు. గోకుల వాసులకు కృష్ణుని మాట వేదవాక్కు లాంటిది. అందుకని వారందరూ గోవర్ధన పర్వతాన్నే పూజించసాగారు.

ఇంద్రునికి మాట చేరవేసిన నారదుడు

గోకుల వాసులంతా ఇంద్రయాగం మానేసి గోవర్ధన పూజ చేస్తున్నారనే విషయాన్ని నారద మహర్షి ఇంద్రునికి చెప్పాడు. వెంటనే ఆగ్రహించిన ఇంద్రుడు గోకుల వాసులకు తగిన బుద్ధి చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

గోకులంపై రాళ్ల వర్షం

గోకుల వాసులపై ఆగ్రహించిన ఇంద్రుడు గోకులంపై ఏడు పగళ్లు, ఏడు రాత్రులు రాళ్ల వర్షాన్ని కురిపించింది. దాంతో గోకుల వాసులంతా అల్లకల్లోమైపోయారు. ఆ ధాటికి భయపడ్డ గోకుల ప్రజలు శ్రీకృష్ణుని శరణు వేడారు.గోవర్ధన గిరి మోసిన గోపాలుడు

గోపాలకులపై అపారమైన కరుణతో శ్రీకృష్ణుడు తన చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి గోపాలకులతో 'ఓ గోపాలకులారా! మీ గోవులను, లేగలను తీసుకుని ఈ గోవర్ధన పర్వతం కిందకు రండి! మనమందరం ఇక్కడే క్షేమంగా ఉందాం. ఈ పర్వతంపై మనకు కావాల్సిన పళ్లు, పశువులకు కావాల్సిన గ్రాసం అన్ని ఉన్నాయి. ఈ రాళ్ల వర్షం ఆగేవరకు మీరందరూ ఇక్కడే రక్షణ పొందండి' అని పిలుపునిచ్చాడు.గోవర్ధన పర్వతం కింద సురక్షితంగా గోపాలకులు!కృష్ణుడు ఇచ్చిన అభయంతో గోపాల బాలకులు శ్రీకృష్ణుని అపారమైన కరుణకు ఆనందించి గోవర్ధన పర్వతం కింద ఏడు రాత్రులు, ఏడు పగళ్లు ఆనందంగా గడిపారు.

ఇంద్రుని గర్వభంగం

శ్రీకృషుడు చేసిన గోవర్ధన లీలను చూసిన ఇంద్రునికి గర్వభంగం అయింది. సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుడుగా అవతరించి ఉన్నాడన్న సంగతి విస్మరించి ఆయనచే పూజలందుకోవాలనుకున్న తన అజ్ఞానానికి చింతించాడు.అయిన శ్రీకృష్ణుడు ఇంద్రుని క్షమించాడు. ఆనాటి నుంచి గోకుల ప్రజలందరూ గోవర్ధన పూజ చేయడం ఆనవాయితీగా మారింది.

ఏ గ్రహ దోషానికి ఏ పండు దానం చేయాలి? బృహన్నారదీయం చెప్పిన ఫలదాన రహస్యం ఇదే!





హైందవ సంప్రదాయంలో దానధర్మాలకు విశిష్టమైన స్థానం ఉంది. ముఖ్యంగా కార్తిక మాసంలో చేసే దానాల వలన కోటి జన్మల పాపాలు పోతాయని, మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. అయితే మనం చేసే దానధర్మాలతో నవగ్రహ దోషాలు కూడా పోతాయంటే అది ఇంకా అద్భుతం కదా! విశేషించి కార్తిక మాసంలో పళ్లను దానం చేస్తే గ్రహ దోషాలు పోతాయని అంటారు. ఏ పండుతో, ఏ గ్రహ దోషం పోతుందో తెలుసుకుందాం.నవగ్రహ దోషాలు మానవ జీవితాన్ని దుర్భరం చేస్తాయి. ఎంత కష్టపడినా ఫలితం రాకపోవడం, ఆర్థిక సమస్యలు, రుణబాధలు, సంతానలేమి, అనారోగ్య సమస్యలకు కారణం గ్రహ దోషాలే! జ్యోతిష్య శాస్త్ర పరంగా నవగ్రహ దోష నివారణకు ఫలదానం విశేషమైన ఫలితాన్ని ఇస్తుంది. గ్రహ దోషాల నివృత్తికి, నవగ్రహాలను ప్రసన్నం చేసుకోవడం ప్రధానం. నవగ్రహ దోషాలు తొలగించుకోవడానికి ఫలదానం ఎంత ప్రధానమైనదో 'బృహన్నారదీయం' లో వివరించి ఉంది. మరి నవగ్రహ దోష నివారణకు ఫలదానం ఎలాంటి ఫలితాన్ని ఇస్తుంది? ఏ గ్రహ దోషానికి ఏ ఫలాన్ని దానం చేయాలనే విశేషాలు ఇప్పుడు చూద్దాం.ఒక్కో గ్రహానికి ఒక్కో ఫలంనవగ్రహాలు 9. గ్రహాధిపతి ఆదిత్యునితో మొదలు పెట్టి కేతువుతో ముగిసే 9 గ్రహాలు వాటి వాటి స్థానాలను అనుసరించి అపుడప్పుడు జాతకునికి దోషాలను కలిగిస్తుంటాయి. అలాంటప్పుడు ఆయా గ్రహాల అనుకూలత కోసం ఏ గ్రహానికి ఏ ఫలం దానం ఇవ్వాలో చూద్దాం.సూర్యాయ మాతులుంగంచ చంద్ర కదళీఫలంకుజయ దాడిమీ ఫలం బుధాయ ఆమ్రఫలం తథాగురవే పనసంచైవ శుక్రాయ ఖర్జూరకం తథాశనయే జంబూ ఫలం చైవ రాహువే నారికేళకంకేతవే మాతులింగంచ ఫలన్యేతాని కల్పయేతఅని బృహన్నారదీయంలో వివరించి ఉంది. ఈ శ్లోకం ప్రకారంగా ఏ గ్రహ దోషానికి ఏ ఫలాన్ని దానం ఇవ్వాలో చూద్దాం.సూర్యుడునవగ్రహాలకు అధిపతి సూర్యుడు. ఆరోగ్య ప్రదాత అయిన సూర్య గ్రహం అనుకూలత లేకపోతే అనారోగ్య సమస్యలు వేధిస్తాయి. వృత్తి పరంగా పురోగతి ఉండదు. సూర్య గ్రహ దోషం ఉన్నవారు ఆదివారం రోజు మాతులుంగ ఫలం అంటే దబ్బపండును దానంగా ఇవ్వడం వలన సూర్యుని అనుగ్రహాన్ని పొందవచ్చుచంద్రుడుచంద్రుడు మనఃకారకుడు. చంద్ర గ్రహ దోషం ఉంటే మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చంద్రుని అనుగ్రహం కోసం సోమవారం రోజు కదళీఫలం అంటే అరటి పండును దానంగా ఇవ్వడం వల్ల చంద్రుని అనుగ్రహం పొందవచ్చుకుజుడుకుజ గ్రహ దోషం వలన వివాహం కావడంలో ఆలస్యం, సంతానం కలగక పోవడం వంటి ఇబ్బందులు ఉంటాయి. కుజుని అనుగ్రహం పొందడానికి మంగళవారం రోజు దాడిమీ ఫలం అంటే దానిమ్మ పండును దానంగా ఇవ్వడం వలన జాతకంలో కుజ దోష ప్రభావం తగ్గుతుంది

బుధుడుజాతకంలో బుధుడు దోష యుక్తమై ఉండి, విద్య ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రతికూల ఫలితాలు వస్తుంటే బుధవారం రోజు మామిడిపళ్లను దానంగా ఇవ్వడం వలన బుధ గ్రహ దోషం తొలగి అన్నింటా అనుకూలిస్తుంది

గురుడుజాతకంలో గురుబలం తక్కువగా ఉండి, వివాహ సంబంధమైన సమస్యలు అధికంగా ఉంటే, వాటిని తొలగించుకునేందుకు గురువారం తాంబూలంలో పనసపండును ఉంచి దానంగా ఇవ్వడం వల్ల గురుగ్రహం అనుకూలత పెరిగి శుభాలు చేకూరుతాయి.

శుక్రుడుతకరీత్యా శుక్రగ్రహ దోషం ఉంటే ఆ దోషాన్ని తొలగించుకునేందుకు శుక్రవారం ఖర్జూర పండ్లను తాంబూలంలో ఉంచి దానంగా ఇస్తే విశేషమైన ధనయోగం సిద్ధిస్తుంది. అంతేకాదు కళారంగంలో కూడా మంచి పురోభివృద్ధి ఉంటుంది.శని భగవానుడు ఏలినాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శని, కంటక శని, సప్తమ శని, వ్యయ శని అనేవి గోచారపరంగా సిద్ధించే శని దోషాలు. ఈ దోషాలు తొలగించుకోవడానికి శనివారం జంబూ ఫలం అంటే నేరేడు పండ్లను తాంబూలంలో ఉంచి దానంగా ఇవ్వడం వలన గోచారరీత్యా కలిగే అన్ని రకాల శని దోషాల నుంచి విముక్తి పొందవచ్చు.

రాహువుజాతకరీత్యా రాహు దోషం ఉంటే విదేశీ ప్రయత్నాలు ఆలస్యం కావడం, విదేశాలకు వెళ్లాలనే కల నెరవేరడంలో జాప్యం జరగడం, స్నేహితులతో ఇబ్బందులు ఎదురు కావడం, అనారోగ్య సమస్యలతో సతమతమవడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అలాంటప్పుడు రాహువుకు ప్రియమైన శనివారం రోజు కొబ్బరికాయను దానంగా ఇవ్వడం వలన రాహు గ్రహ దోషం తొలగి సానుకూల ఫలితాలు లభిస్తాయి.వారు మాతులుంగ ఫలం దానం చేయడం వలన విశేషమైన శుభ ఫలితాలు పొందవచ్చు.

బలి చక్రవర్తి పాతాళానికి ఎందుకు వెళ్లాడు? భూమిపైకి తిరిగి వచ్చే వరం కథ ఇదే



దీపావళి అమావాస్య మరుసటి రోజు, కార్తిక శుద్ధ పాడ్యమిని బలి పాడ్యమిగా జరుపుకోవడం సంప్రదాయం. ఈ సంప్రదాయం వెనుక శ్రీ మహావిష్ణువు దశావతారాలకు సంబంధించిన పురాణ గాథ ఒకటి ఉంది. ఈ సందర్భంగా అసలు బలి చక్రవర్తి ఎవరు? ఆయన పాతాళానికి ఎందుకు వెళ్లాడు? భూమిపైకి తిరిగి వచ్చే వరం ఆయనకు ఎవరిచ్చారు? అనే విషయాలు తెలుసుకుందాం.తెలుగు పంచాంగం ప్రకారం కార్తిక శుద్ధ పాడ్యమిని బలి పాడ్యమిగా జరుపుకుంటాం. ఈ ఏడాది నవంబర్ 10, మంగళవారం కార్తిక శుద్ధ పాడ్యమి సందర్భంగా ఈ రోజునే బలి పాడ్యమిగా జరుపుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా బలి పాడ్యమి విశిష్టత గురించి తెలుసుకుందాం.

ఎవరీ బలి చక్రవర్తి?

శ్రీమద్భాగవతం, విష్ణు పురాణం ప్రకారం మహాభక్తుడైన ప్రహ్లాదుని మనుమడే బలి చక్రవర్తి. తన తాత మాదిరిగానే ఈయన కూడా విష్ణు భక్తుడు. ప్రజారంజకంగా పరిపాలించే గొప్ప పాలకుడు.

స్వర్గాధిపత్యం కోల్పోయిన ఇంద్రుడు

ఒకానొకసారి బలి చక్రవర్తి విశ్వజిత్ యాగం చేసి, విప్రులకు, మహర్షులకు దానధర్మాలు చేసి అత్యంత శక్తిమంతుడై ఇంద్రుడిపై దండెత్తి ఇంద్రలోకాన్ని ఆక్రమిస్తాడు. ఇంద్రుడు స్వర్గాధిపత్యాన్ని కోల్పోవడమే కాకుండా దేవతలు శక్తిహీనులవుతారు. ఆ సందర్భంలో దేవతలంతా కలిసి శ్రీ మహావిష్ణువును ప్రార్థిస్తారు. అప్పుడు శ్రీహరి తాను అవతార స్వీకారం చేసి బలి అహంకారాన్ని అణిచి, దేవతలకు పూర్వ వైభవాన్ని తీసుకు వస్తానని మాట ఇస్తాడు.

శ్రీ మహావిష్ణువు అవతార స్వీకారం

దేవతలకు అభయమిచ్చి నట్లుగానే శ్రీమన్నారాయణుడు కశ్యప ప్రజాపతి భార్య అయిన అదితి గర్భాన జన్మిస్తాడు. పుట్టీపుట్టగానే 5 సంవత్సరాల బాలుడిగా మారిపోతాడు. వామనుడిగా ఉన్న ఈ పిల్లవాడికి తల్లిదండ్రులు ఉపనయన సంస్కారాలు జరిపిస్తారు.

బలి చక్రవరి అశ్వమేధ యాగం

అదే సమయంలో బలి చక్రవర్తి అశ్వమేధ యాగం చేస్తున్నాడని, బ్రాహ్మణులకు భూరి విరాళాలు, దానధర్మాలు చేస్తున్నాడని వామనుడికి తెలుస్తుంది. వెంటనే ఈ వామనుడు బలి యాగం నిర్వహిస్తున్న యాగశాల ప్రాంతానికి చేరుకుంటాడు. వామనుని చూడగానే అతని తేజస్సు చూసి బలి ఆశ్చర్యపోతాడు.ఒకానొకసారి బలి చక్రవర్తి విశ్వజిత్ యాగం చేసి, విప్రులకు, మహర్షులకు దానధర్మాలు చేసి అత్యంత శక్తిమంతుడై ఇంద్రుడిపై దండెత్తి ఇంద్రలోకాన్ని ఆక్రమిస్తాడు. ఇంద్రుడు స్వర్గాధిపత్యాన్ని కోల్పోవడమే కాకుండా దేవతలు శక్తిహీనులవుతారు. ఆ సందర్భంలో దేవతలంతా కలిసి శ్రీ మహావిష్ణువును ప్రార్థిస్తారు. అప్పుడు శ్రీహరి తాను అవతార స్వీకారం చేసి బలి అహంకారాన్ని అణిచి, దేవతలకు పూర్వ వైభవాన్ని తీసుకు వస్తానని మాట ఇస్తాడు.

ఏం కావాలో కోరుకోమంటాడు.

బలి పరవశం

అసలే విష్ణు భక్తుడైన బలి చక్రవర్తి వామన రూపంలో వచ్చింది శ్రీహరి అని గ్రహించి భక్తి పారవశ్యంతో హరి పాదాలు కడిగి ఆయన అడిగిన మూడు అడుగులు నేలను దానంగా ఇవ్వడానికి సిద్ధపడుతారు.ఇంతింతై వటుడింతై చూస్తుండగానే వామన రూపంలో ఉన్న శ్రీహరి మొదటి అడుగుతో భూమిని, రెండో అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడో అడుగు ఎక్కడ వేయాలని అడుగుతాడు. అప్పుడు బలి చక్రవర్తి సంకోచించకుండా తన శిరసుపై హరి పాదాన్ని మోపమని కోరుతాడు.

పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్తున్నారా? - తల్లిదండ్రులుగా ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!



ఉద్యోగ బాధ్యతలు లేదా అత్యవసర పనుల వల్ల తల్లిదండ్రులిద్దరూ పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్లాల్సి రావడం ఈరోజుల్లో సహజం. అయితే ఇలాంటప్పుడు పిల్లలు ఒంటరితనం, ఆందోళనతో పాటు భద్రతా పరమైన సమస్యలను కూడా ఎదుర్కొనే ఛాన్స్ ఉంది. పిల్లల వయస్సును బట్టి వారు ఎదుర్కొనే సవాళ్లు మారుతుంటాయి కాబట్టి, వారు ఇంట్లో సురక్షితంగా ఉండేందుకు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు చూద్దాం.

అందులో పోస్ట్‌చేయొద్దు :

కొందరికి తాము చేసే ప్రతి పనిని ఇతరులకు తెలియజేయాలనే ఆత్రుతతో సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతుంటారు. ఒక్కోసారి ఇవే ప్రమాదకరంగా మారుతాయని చెబుతున్నారు నిపుణులు.

ఇదే విషయాన్ని మీ పిల్లలకు తెలియజేయాలంటున్నారు. మీరు మీ పిల్లలను ఇంట్లో ఉంచి బయటకు వెళ్లినప్పుడు, వారు ఒంటరిగా ఉన్నారని తెలియజేసే విధంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టొద్దని తెలియజేయాలి. ఇలాంటి పోస్టులు పెట్టడం వల్ల కలిగే ప్రమాదాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలి.

వారొస్తే డోర్ తీయవద్దు :

సాధారణంగా మనం బయటకు వెళ్లినప్పుడు అపరిచితులకు(తెలియని వారికి) దూరంగా ఉండాలని, వారు ఏది ఇచ్చినా తీసుకోవద్దని పిల్లలకు చెబుతుంటాం. మీరు(తల్లిదండ్రులు) ఇంట్లో లేని సమయంలోనూ అదే పద్ధతిని ఫాలో అవ్వమని చెప్పాలి. అలాగే తెలియని వారెవరైనా ఇంటికొచ్చి డోర్ కొడితే తీయవద్దని చెప్పాలి. ఇందుకోసం మీ ఇంటి చుట్టూ సెక్యూరిటీ కెమెరాలను ఏర్పాటు చేయండి. ఇలా చేయడం వల్ల ఎవరు డోర్ బెల్ కొట్టారో పిల్లలు ఈజీగా తెలుసుకోవడానికి వీలుంటుంది. అలాగే మీరు ఎక్కడున్నా సరే మధ్యమధ్యలో ఈ కెమెరాల ద్వారా వాళ్లను ఓ కంట కనిపెట్టడం మర్చిపోవద్దని సూచిస్తున్నారు నిపుణులు.'ఆల్ఫా హస్బెండ్'?తో వేగలేకపోతున్నారా? – గొడవ పడకుండా బుద్ధి చెప్పే స్మార్ట్ టిప్స్!

ఆ ప్రయోగాలు వద్దు!

కొంతమంది పిల్లలు అమ్మానాన్న ఇంట్లో లేని సమయాన్ని చూసి, తామే పెద్దవాళ్లమైపోయామనే సరదాలో వంటగదిలోకి దూరి రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. ముఖ్యంగా సొంతంగా వంట చేయడానికి ట్రై చేస్తుంటారు.

ఇది అస్సలు మంచిది కాదంటున్నారు. మీరు బయటకు వెళ్లినప్పుడు గ్యాస్ స్టవ్ పూర్తిగా ఆఫ్ చేసి వెళ్లాలి. అదేవిధంగా ఇలాంటి మంట వచ్చే వస్తువులకు దూరంగా ఉండమని పిల్లలకు చెప్పాలి. దానివల్ల వచ్చే అనర్థాలను వారికి వివరించి చెప్పాలంటున్నారు.

ఎమర్జెన్సీ నంబర్లు :

పేరెంట్స్ ఇంట్లో లేనప్పుడు ఏదైనా ఊహించని అత్యవసర పరిస్థితి వస్తే, పిల్లలు ఎవరిని సంప్రదించాలో ముందే స్పష్టమైన అవగాహన కల్పించాలి. ఆపద సమయంలో భయపడకుండా వెంటనే స్పందించేలా పిల్లలను సిద్ధం చేయడం చాలా ముఖ్యం. అత్యవసర సేవలకు సంబంధించిన నంబర్లు వారి మొబైల్?లో సేవ్ చేయాలి. అలాగే, మీ సన్నిహితులు, ఇంటి పక్కన ఉన్నవారి నంబర్లను కూడా పిల్లలకు ఇవ్వాలని చెబుతున్నారు నిపుణులు.

ఇవి కూడా పాటించండి!

ఇంట్లో ఎమర్జెన్సీ లైట్లకు ఎప్పుడూ ఛార్జింగ్ ఉండేలా చూసుకోవాలి. పిల్లలకు దానిని ఎలా ఉపయోగించాలో తెలియజేయాలి. ఎప్పుడైనా కరెంట్ లేనప్పుడు, ఇన్వర్టర్ పని చేయనప్పుడు ఇది చాలా బాగా యూజ్ అవుతుంది.

ఇంటర్నెట్ వాడకానికి సంబంధించిన జాగ్రత్తలను పిల్లలకు వివరించాలి. మొబైల్?లో లొకేషన్‌ను ఆఫ్ చేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత విషయాలను పంచుకోకుండా ఉండడం వంటివి ఇందులో భాగమే అంటున్నారుపిల్లలు ఆడుకుంటున్న టైమ్?లో దెబ్బలు తగిలించుకోవడం మామూలే.

ఒకవేళ మీరు ఇంట్లో లేనప్పుడు అలా జరిగితే వారే సొంతంగా ప్రథమ చికిత్స చేసుకునేలా శిక్షణ ఇవ్వడం మంచిది. ఇది వివిధ సందర్భాల్లో వారికి ఎంతో ఉపయోగపడుతుంది.

ఇంట్లో ఉండే మందులను వారికి దూరంగా పెట్టాలి.పిల్లలకు ఈ జాగ్రత్తలన్నిటినీ కేవలం మాటల్లో చెప్పడమే కాదు,

వారు నిజంగా ఆపద టైమ్?లో ఎలా ఆచరిస్తారో మీ పర్యవేక్షణలోనే ఒకసారి స్వయంగా పరీక్షించి చూడడం ఎంతో ముఖ్యమని సూచిస్తున్నారు నిపుణులు.

బిగ్ బాస్ వల్ల నాకు ఏం ఉపయోగం లేదు



సినిమా అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు.. వ్యక్తిగత జీవితంలో ఒడిదొడుకులు.. ప్రేమలో ఎదురైన చేదు అనుభవాలు.. బిగ్ బాస్ తర్వాత కెరీర్‌లో వచ్చిన మార్పులు.. ఇలా నటి ఇనయా సుల్తానా ఓ ఇంటర్వ్యూలో తన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినీ పరిశ్రమలో అవకాశాల కోసం తాను పడిన కష్టాలను వివరిస్తూనే, తన బ్రేకప్‌కు గల కారణాలను కూడా బయటపెట్టారు. అంతేకాదు, బిగ్ బాస్ షో తర్వాత తన పారితోషికం తగ్గిపోయిందని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇంతకీ ఇనయా సుల్తానా ఏయే విషయాలను పంచుకున్నారంటే.. సినిమా ఇండస్ట్రీలో అవకాశాలు సంపాదించడం అంత సులభం కాదని ఇనయా సుల్తానా తెలిపారు. అవకాశాల కోసం పలువురిని స్వయంగా కలవాల్సి వచ్చిందని, కొన్నిసార్లు చిన్న చిన్న పాత్రలు చేయడానికి కూడా సిద్ధపడ్డానని గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో మనుషులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం తనకు ఉందని, మీడియా కూడా తనకు ఎంతో కొంత అండగా నిలిచిందని చెప్పారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ గత ప్రేమ వ్యవహారంపై ఇనయా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు వస్తున్న పేరు, ఫేమ్, సినిమా అవకాశాలను మాజీ ప్రియుడు తట్టుకోలేకపోయేవాడని తెలిపారు. అతడి అసూయే తమ బ్రేకప్‌కు ప్రధాన కారణమని వెల్లడించారు.తన సోషల్ మీడియా ప్రొఫైల్‌లో గతంలో మాదిరిగా ఫోటోషూట్ చిత్రాలు కనిపించవని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చేస్తున్న సినిమా ప్రాజెక్టుల గురించి కూడా బయటకు చెప్పడం లేదని ఇనయా వెల్లడించారు. ప్రాజెక్టుల వివరాలు ముందుగానే పంచుకుంటే దిష్టి తగులుతుందనే భయం ఉందని, అందుకే సినిమాల విషయాలను గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు.తదుపరి ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తాననే సంకేతాలిచ్చారు.

బలగం సినిమా ఆడిషన్‌కు వెళ్ళినప్పుడు దిల్ రాజు చెప్పిన మాటకు షాక్ అయ్యా.!



తెలుగు సినీ ప్రేక్షకులకు బాలనటిగా పరిచయమైన కావ్య కళ్యాణరామ్, తన అద్భుతమైన నటనతో ప్రస్తుతం కథానాయికగా దూసుకుపోతున్నారు. ఇటీవల విడుదలైన మసూద అలాగే బలగం వంటి చిత్రాలతో విజయాలను సొంతం చేసుకున్న కావ్య, తన సినీ ప్రయాణం, చిత్రాల ఎంపిక, వ్యక్తిగత విషయాల గురించి ఓ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్నతనంలోనే సినీరంగ ప్రవేశం చేసిన కావ్య, అప్పటి టాప్ హీరోలతో కలిసి నటించి మంచి గుర్తింపు పొందారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.మసూద చిత్రాన్ని అంగీకరించడానికి గల కారణాన్ని వివరిస్తూ, కథే తనను ఆకట్టుకుందని కావ్య తెలిపారు. దిల్‌రాజ్ సమర్పణలో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రంలో, మళ్ళీ రావా మరియు ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ వంటి మంచి సినిమాలు నిర్మించిన వారిపై నమ్మకంతోనే తాను సినిమాను ఒప్పుకున్నానని చెప్పారు.



ఈ వారం థియేటర్లలో 10 కొత్త సినిమాలు

దీపావళి కానుకగా రిలీజైన రామాయణ, సీన్ సినిమాలు సూపర్ హిట్ టాక్ తో రన్ అవుతున్నాయి. అయితే ఈ వారం కూడా భారీగా సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఇట్లు అర్జున, గోట్(+.ా.ా.ం), భోగి, మాయ లేడీ, డార్క్ చాక్లెట్, దొంగ నా కొడుకు, చంద్రయాన్, జింగో పెన్, అ, టాల్కమ్ పౌడర్.. ఇలా దాదాపు 10 కు పైగా సినిమాలు వెండితెరపై సందడి చేయనున్నాయి. మరోవైపు ఓటీటీలోనూ పెద్ద ఎత్తున సినిమాలు స్ట్రీమింగ్ కు రాబోతున్నాయి. దసరాకు థియేటర్లలో రిలీజైన సినిమాలన్నీ ఈ వారంలోనే ఓటీటీలోకి వచ్చే అవకాశముంది. జైలర్ 2, రణబాలి స్ట్రీమింగ్ డేట్స్ సినిమాల స్ట్రీమింగ్ డేట్స్ ఖరారు కాగా క్రేజీ కల్యాణం కూడా ఈ వీకెండ్ లోనే స్ట్రీమింగ్ కు వచ్చే ఛాన్స్ ఉంది. వీటితో పాటు దాయిరా, వైబ్, పరివారిక్ మనురంజన్ లాంటి డబ్బింగ్ చిత్రాలు.. పుష్పక విమానం అనే తెలుగు సిరీస్ ఉన్నంతలో చూడాలనే ఆసక్తి కలిగిస్తున్నాయి. మరి ఈ వారంలో ఏయే సినిమా ఏయే ఓటీటీలో వస్తుందో తెలుసుకుందాం రండి.నెట్‌ఫ్లిక్స్‌ద గుడ్ లాయర్ (ఫ్రెంచ్ సినిమా) -- నవంబర్ 09ద బాడీ (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) -- నవంబర్ 11నెవర్ సరండర్ (ఇండోనేసియన్ సినిమా) -- నవంబర్ 12మిరాకిల్స్ ఆఫ్ ఈఆర్ (కొరియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 12దాయిరా (హిందీ మూవీ) -- నవంబర్ 13రణబాలి (తెలుగు సినిమా) -- నవంబర్ 13హార్ట్ ల్యాండ్ (కెనడియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 13కంక్ ఆన్ సినిమా (ఇంగ్లిష్ మాక్యుమెంటరీ) -- నవంబర్ 15అమెజాన్ ప్రైమ్ వీడియోజైలర్ 2 (తెలుగు డబ్బింగ్ సినిమా) -- నవంబర్ 12వైబ్ (హిందీ చిత్రం) -- నవంబర్ 13జియో హాట్‌స్టార్పుష్పకవిమానం (తెలుగు వెబ్ సిరీస్) -- నవంబర్ 12స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్: ఆఫ్టర్ డార్క్ (హిందీ వెబ్ సిరీస్) -- నవంబర్ 13జీ5బ్లైండ్ గేమ్ (హిందీ సినిమా) -- నవంబర్ 11
బాంద్రా (తెలుగు డబ్బింగ్ మూవీ) -- నవంబర్ 13అఫ్రాతఫ్రీ (మరాఠీ చిత్రం) -- నవంబర్ 13మిర్గయ 1.5 (బెంగాలీ) -- నవంబర్ 13

ఆ హీరో మార్కెటింగ్ ప్లాన్ అదిరిపోతుంది




ప్రస్తుత చిత్ర పరిశ్రమలోని ఆర్థిక, క్రియేటివ్ సవాళ్లపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన విశ్లేషణను ఓ ఇంటర్వ్యూలో వివరించారు. పెద్ద హీరోలు అధిక పారితోషికం తీసుకుంటూ, భారీ బడ్జెట్ చిత్రాలలోనే నటించాలనే ఒత్తిడిని ఎదుం్కొంటు న్నారని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులు వారి నుంచి అధిక అంచనాలను పెట్టుకోవడం దీనికి కారణం అన్నారు. ఉదాహరణకు, మన ఇండస్ట్రీ పెద్ద హీరోలు 127 అవర్స్ వంటి ప్రయోగాత్మక చిత్రం చేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారా.? అన్నది ప్రశ్నార్థకం. స్టార్‌డమ్ అంటే కేవలం నటుడి స్క్రీన్ ప్రజెన్స్ అని, కథ కంటే కాస్టింగ్ ఫ్యాక్టర్ ముఖ్యమని ఆర్జీవీ పేర్కొన్నారు.బాలీవుడ్ స్టార్ ఆమీర్ ఖాన్ అనుసరించిన వినూత్న మార్కెటింగ్ వ్యూహాన్ని వర్మ ప్రస్తావించారు. ఆమీర్ గజిని వంటి పెద్ద హిట్ తర్వాత, తారే జమీన్ పర్ వంటి చిన్న, ఆర్ట్-హౌస్ సినిమాను తక్కువ బడ్జెట్‌తో నిర్మించి, దానిని గజిని అమ్మిన ధరలో 10వ వంతుకే అమ్మేశారు. ఈ లాజిక్ ప్రకారం, తక్కువ ధరలో అమ్మి, తక్కువ వసూళ్లు వచ్చినా సినిమా విజయం సాధించినట్లు అవుతుంది, దానివల్ల పెట్టుబడిపై రాబడి పెరుగుతుంది. ఇది భారతీయ సినీ పరిశ్రమలో చాలా మంది అనుసరించని లాజిక్ అని ఆర్జీవీ అన్నారు. భారీ బడ్జెట్ కారణంగా రాధే శ్యామ్ వంటి చిత్రాలు ఆశించిన విజయం సాధించలేదని, బాహుబలి మాత్రం నటులు హిందీ ప్రేక్షకులకు తెలియకపోయినా, భారీ విజువల్స్ కారణంగా విజయం సాధించిందని ఆయన తెలిపారు. ఆర్జీవీ తన సొంత చిత్రాలైన శివ, సత్యలను ఉదాహరణగా చూపుతూ, తనకు ఆనందం కలిగించిన కథలనే తక్కువ బడ్జెట్‌తో, వాస్తవిక లొకేషన్లలో, పక్కా ప్లాన్ తో తీశానని వివరించారు.సినిమాకు ఏం అవసరమో దానికే ఖర్చు చేశానని, డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో చాలా మందికి ఆడియన్స్ టేస్ట్ గురించి తక్కువ అవగాహన ఉంటుందని, ఒక సినిమా ఎందుకు హిట్ అవుతుందో లేదా ఫ్లాప్ అవుతుందో అర్థం చేసుకోలేరని ఆర్జీవీ అన్నారు. అలాగే చిల్డ్రన్ ఆఫ్ హెవెన్ అనే ఇరానియన్ చిత్రాన్ని ఇండియాలో తార రం పం పేరుతో రీమేక్ చేసిన విధానాన్ని వివరిస్తూ, అసలు సినిమా వెనుక ఉన్న ఉద్దేశ్యం (“పిల్లల కోసం సినిమా తీయడం”) మారిపోయి, వ్యాపార లాభాల కోసం ప్రయత్నించినప్పుడు ఎలాంటి నష్టాలు సంభవిస్తాయో ఆర్జీవీ ఉదహరించారు. హానెస్టీ అలాగే మెయిన్ పాయింట్ నుంచి డైవర్ట్ అవ్వడం వల్ల చిత్రనిర్మాతలకు నష్టం వాటిల్లుతుందని ఆయన చెప్పారు. విభిన్న చిత్రాలు విజయం సాధిస్తుండటాన్ని బట్టి, ప్రేక్షకులు ఏదైనా చూస్తారని స్పష్టమవుతోందని, కాబట్టి చిత్రనిర్మాతలు తమ సొంత నమ్మకాన్ని అనుసరించడమే సరైన మార్గమని ఆర్జీవీ అన్నారు.

ఇది కదా ఫ్యాన్స్‌కు కావాల్సింది.. ఎన్టీఆర్- అనిల్ రావిపూడి క్రేజీ కాంబో.. నవ్వుల విందుకు రంగం సిద్ధం!



టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు తెరలేచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలిసి ఓ సినిమా చేయబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాకపోవడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. అనిల్ రావిపూడితో కలిసి దిగిన ఫోటోను షేర్ చేస్తూ ‘నవ్వుల విందు సిద్ధమవుతోంది’ అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఈ సినిమా పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే హింట్ ఇచ్చేశారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మించనున్నారు. మరోవైపు అనిల్ రావిపూడి కూడా ఈ కాంబినేషన్‌పై స్పందిస్తూ.. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందనే అర్థం వచ్చేలా సరదాగా అంటూ పోస్ట్ చేశారు.ప్రస్తుతం తారక్ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం పూర్తయిన తర్వాత ఎన్టీఆర్ చేయబోయే సినిమా ఏదనే విషయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడితో సినిమా ప్రకటన రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రశాంత్ నీల్ సినిమాతో యాక్షన్ మోడ్‌లో కనిపించనున్న తారక్.. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మాత్రం తనలోని కామెడీ టైమింగ్‌ను మరోసారి చూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు హీరో ఎలివేషన్స్‌కు కూడా ప్రత్యేక స్థానంచూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌ను ఆయన ఎలా చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది.ఇదిలా ఉంటే ఇప్పటికే ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ భారీ పౌరాణిక నేపథ్య చిత్రం తెరకెక్కనుందనే వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులకు సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈలోపు మరో సినిమా చేయాలని ఎన్టీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ఆ సమస్య వాళ్ళ కొన్ని సంవత్సరాలు డిప్రెషన్ లోకి వెళ్లా...



నటి బిందు మాధవి తన సినీ ప్రస్థానం, వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, ముఖ్యంగా ప్రేమ విషయంలో డిప్రెషన్‌తో పోరాడిన అనుభవాలు, మరియు తెలుగు చిత్ర పరిశ్రమకు తిరిగి రావాలనే తన ఆశయాలను ఇండియాగ్లిట్జ్ తెలుగుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆమె వెల్లడించిన విషయాలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన బిందు మాధవి, మొదట చెన్నైకి వెళ్లి మోడలింగ్ చేశారు. ఆ తర్వాత సెగ అనే సినిమా ద్వారా ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు.తెలుగులో ఆవకాయ్ బిర్యానీ చిత్రం ఆమెకు ఒక బ్రేక్ అని చెప్పవచ్చు. ఈ సినిమా తర్వాత ఆమె హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారు, ఆమె తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో గుంటూరు, విజయవాడలో పనిచేసేవారు. బిందు మాధవి హైదరాబాద్‌లో స్థిరపడాలని భావించడంతో ఆమె తండ్రి కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వచ్చారు. అయితే, తెలుగులో ఆమె ఆశించిన స్థాయిలో సరైన పాత్రలు లభించలేదు. కేవలం పక్కన నిలబడటం, నవ్వడం, ఒక పాటలో కనిపించడం వంటి పాత్రలే వస్తూ ఉండేవని, వాటి పట్ల తనకు ఆసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. అవకాశాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.అప్పుడు తనకు వచ్చిన అవకాశాలతో తాను సంతృప్తిగా లేనని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆవె తిరిగి చెన్నైకి వెళ్లి అక్కడ ఆడిషన్స్ ఇచ్చి తమిళ చిత్రాలలో అవకాశాలు సంపాదించారు. తమిళంలో తనకు లభించిన పాత్రలతో ఆమె సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అయితే, తమిళంలో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే ఆమె సుమారు మూడు నుండి నాలుగు సంవత్సరాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.